సమగ్ర తెలుగు దినపత్రిక

Website: www.adugunews.com

# అడుగు

The Step Towards The Truth..

హైదరాబాద్ | శనివారం 11 ఏప్రిల్ 2026 | సంపుటి: 02 | సంచిక: 54 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com


## జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా

- అభిశంసనకు ముందే నిర్ణయం
- ఇంట్లో కాలిన నోట్ల కట్టల కేసు వ్యవహారం

న్యూఢిల్లీ,ఏప్రిల్10(అడుగు న్యూస్): అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఢిల్లీలోనితన నివాసంలో కాలిన నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆయనను తొలగించేందుకు అభిశంసన ప్రక్రియకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం

మిగతా 3లో..

## హరివంశ్ కు మరో ఛాన్స్

న్యూఢిల్లీ,ఏప్రిల్10(అడుగు న్యూస్): రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ కొనసాగే అవకాశ ముంది. అనుభవజ్ఞుడైన నాయకుడిగా, నిష్పక్షపాతంగా సభను నడిపించే సమర్థత కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. భారత పార్లమెంట్ ఎగువసభలో అత్యంత హుందాతనం గల నేతగా పేరుగాంచిన హరివంశ్.. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగబోతున్నారు.

మిగతా 3లో..



# నేడే శాంతి చర్చలు!

- విరమణలోనూ... విధ్వంసాలే
- యుద్ధంపై చర్చల ప్రతిష్టంభన
- లెబనాన్ పై దాడులు ఆపితేనే..
- చర్చలకు వస్తామన్న ఇరాన్...
- అమెరికా చెప్పినా ఇజ్రాయెల్ తగ్గట్లే
- లెబనాన్ లో భద్రతా సిబ్బంది సహా...
- సామాన్య పౌరుల దుర్మణం
- ఇజ్రాయెల్ పైకి హిజ్బుల్లా రాకెట్లు, డ్రోన్లు
- పాక్ కు అమెరికా, ఇరాన్ ప్రతినిధులు
- డీల్ కుదరకపోతే దాడులే!
- నౌకల నిండా బాంబులే...
- ఇరాన్ తో పని లేకుండానే..
- హర్మూజ్ ను తెరిపిస్తాం : ట్రంప్ హెచ్చరిక



ఇస్లామాబాద్,ఏప్రిల్10(అడుగు న్యూస్): అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం తొలగిపోలేదు. సీజ్‌ఫైర్ వేళ.. శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న శనివారం రాజధాని ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత

మిగతా 2లో..

## ఆ 5 రాష్ట్రాల ఎన్నికల కోసమే..

# ఈ హడావుడి!

- ఆగమాగంగా మహిళా రిజర్వేషన్లు పునర్విభజన బిల్లులు
- పోలింగ్ తర్వాతే పార్లమెంట్ పెట్టాలని చెప్పినా పట్టించుకోలే
- ఎన్నికల మధ్య పార్లమెంట్ సమావేశాలు చట్ట ఉల్లంఘనే
- జనగణన తర్వాతే డీ లిమిటేషన్, ఎన్నికలయ్యాకే మహిళా బిల్లు
- 15న ప్రతిపక్షాలతో ఖర్గే సమావేశం..సిడబ్ల్యుసి నిర్ణయం
- రాజకీయ లబ్ది కోసమే ఈ హడావుడి : ఖర్గే
- పునర్విభజన దక్షిణాదికి నష్టమే : సీఎం రేవంత్ రెడ్డి
- మహిళా బిల్లులో ఈబీసీలకు చోటేది?
- మా వాటాను బట్టి మా సీట్లివ్వండి!
- బీఆర్ఎస్ లోకి వెళితే బేరే : జీవన్ రెడ్డిపై సీఎం వ్యాఖ్య



న్యూఢిల్లీ,ఏప్రిల్10(అడుగు న్యూస్): జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సమాలోచనలు చేసింది. ముఖ్యంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. మహిళా బిల్లు, సీట్లు పెంపుదల వంటి రెండు అంశాలపై వ్యూహాత్మకంగా ఉ ండాలని నిర్ణయించారు. దేశ రాజధాని ఢిల్లీ ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీసమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో

మిగతా 2లో..

## ‘అన్న’లు లేని తెలంగాణ!

- మిగిలింది ఐదుగురే!!
- గణపతి అడవిలో లేరు!!!
- ఎన్ఐఏ కేసులతో మాకేం సంబంధం?
- డీజీపీ ఎదుట లొంగిపోయిన పీఎల్జీఏ కేశాలు
- ఆయుధాలతో 42 మంది మావోయిస్టుల లొంగుబాటు
- భారీగా బంగారం, ఆయుధాలు అప్పగింత
- లొంగినవారికి రూ.1.93కోట్ల రివార్డు, హెల్త్ కార్డులు
- వారికి పునరావాసం కల్పిస్తామన్న శివధర్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్10(అడుగు న్యూస్): తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు అగ్రనేత, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ డిప్యూటీ కమాండర్ సోడిమల్ల కేశాలు లొంగిపోయారు. అతనితోపాటు మొత్తం 42 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. ఛత్తీస్‌గఢ్- తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల నుంచి వచ్చి వీరంతా లొంగిపోయారు. ములుగు, భూపాలపల్లి మీదుగా పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోతున్నట్లు ప్రకటించారు.అనంతరం సరిహద్దుల నుంచి పోలీసులు వీరిని వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించారు. మావోయిస్టు నేత హిడ్మా గెరిల్లాను వదిలి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి వెళ్లిన తర్వాత బెటాలియన్



మిగతా 2లో..

## ఫ్లాష్...ఫ్లాష్...ఫ్లాష్...

## చరిత్ర సృష్టించిన ఆర్టెమిస్-2

### సురక్షితంగా భూమికి చేరిన వ్యోమగాములు

వాషింగ్టన్, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్): చంద్రుడి చుట్టూ చారిత్రాత్మక పది రోజుల యాత్రను ముగించుకుని నాసాకు చెందిన ‘ఆర్టెమిస్-2’ వ్యోమగాములు శనివారం తెల్లవారుజామున సురక్షితంగా భూమికి చేరుకున్నారు. కాలిఫోర్నియాలోని శాన్డియాగో తీర సమీపంలో పసిఫిక్ మహాసముద్రంలో వ్యోమగాముల ‘ఒరాయన్’ క్యాప్సూల్ భారత కాలమానం ప్రకారం ఉదయం 5:38 గంటలకు ల్యాండ్ అయింది. ఈ మిషన్‌లో అమెరికాకు చెందిన రీడ్ వైజ్మాన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్‌లతో పాటు కెనడాకు చెందిన జెరెమీ హాన్సన్ పాల్గొన్నారు. గతంలో అపోలో-13 నెలకొల్పిన రికార్డును అధిగమిస్తూ, భూమి నుండి సుమారు 4,06,771 కిలోమీటర్ల సుదూర ప్రాంతానికి ప్రయాణించిన తొలి మానవసహిత మిషన్‌గా ఆర్టెమిస్-2 సరికొత్త చరిత్ర సృష్టించింది.

మిగతా 2లో..



# కలిసే పని చేద్దాం!

- అన్నా.. నన్ను దేవుడే పంపిండు!
- తిరోగమనంలో కాంగ్రెస్
- రేవంత్ చెప్పుచేతల్లో ఎఐసీసీ
- ఎర్రవల్లిలో కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ

గజ్వేల్,ఏప్రిల్10(అడుగు న్యూస్): మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అనంతరం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై పట్టు కోల్పోయిందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు పీసీసీ చెప్పినట్లు సీఎం నడుచుకునేవారని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిందే పీసీసీ అమలు చేస్తోందని అన్నారు. కేసీఆర్‌తో దాదాపు 5 గంటలపాటు జీవన్‌రెడ్డి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో

మిగతా 2లో..



## 20న జగిత్యాలలో భారీ బహిరంగ సభ

### ఆరోజే కేసీఆర్ సమక్షంలో గులాబీ గూటికి జీవన్ రెడ్డి

గజ్వేల్,ఏప్రిల్10(అడుగు న్యూస్): కాంగ్రెస్‌ను వీడిన టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం ఖాయమైంది. శుక్రవారం ఎర్రవల్లిలో గులాబీ అధినేత కేసీఆర్ ను కలిసిని జీవన్ రెడ్డి ఏప్రిల్ 20వ తేదీన పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. కేసీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరుతున్నందున జగిత్యాలలో తమ ప్రాబల్యాన్ని చాటేందుకు భారీ బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ భావిస్తోంది. ఈ సమావేశానికి ప్రత్యేక అతిథిగా రావాల్సిందిగా కేసీఆర్‌ను జీవన్ రెడ్డి ఆహ్వానించారు. కాంగ్రెస్‌తో 20 ఏళ్లకుపైగా అనుబంధాన్ని తెంచుకున్న జీవన్ రెడ్డి శుక్రవారం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. తన బృందంతో

మిగతా 2లో..

## ఆర్టీసీ కార్మికులకు... 2.1 శాతం డీఏ పెంపు

- 52.8% నికి చేరుకున్న డీఏ
- పెండింగ్ డీఏ విడుదల
- జనవరి 1 నుంచే అమల్లోకి
- ఏప్రిల్ జీతంతో గత 3 నెలల డీఏ
- 38వేల మంది కార్మికులకు లబ్ధి

హైదరాబాద్,ఏప్రిల్10(అడుగు న్యూస్): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆర్టీసీ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఏకైక కరువు భత్యాన్ని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జనవరి 2026 నుంచి అమల్లోకి వచ్చిన ఈ 2.1 శాతం పెంపుతో, ఉద్యోగుల మొత్తం

మిగతా 2లో..

## ఫ్లాష్...ఫ్లాష్...ఫ్లాష్...

## ప్రేమోన్మాదిపై కాల్పులు

కడప, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్): కడప జిల్లా ఖాజీపేటలో అత్యంత క్రూరంగా ఓ ఇంటర్ విద్యార్థినిని గొంతుకోసి హత్య చేసిన నిందితుడు వెంకటేశ్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. ఖాజీపేట అగ్రహారం గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను, ఆంజనేయ కొట్టాల గ్రామానికి చెందిన వెంకటేశ్ ప్రేమ పేరుతో వేధిస్తూ, పెళ్లి చేసుకోవాలని

మిగతా 2లో..

## డీజీపీగా సివి ఆనంద్?

- ప్రభుత్వ పరిశీలనలో పేరు?
- తుది దశకు నియామక ప్రక్రియ
- ఈనెల 14 తర్వాత అధికారిక ఉత్తర్వులు!

హైదరాబాద్,ఏప్రిల్10(అడుగు న్యూస్): తెలంగాణ రాష్ట్రానికి కొత్త పోలీస్ బాస్ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. 1991వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సి.వి. ఆనంద్ తెలంగాణ రాష్ట్ర తదుపరి పూర్తి స్థాయి డీజీపీగా బాధ్యతలు

మిగతా 2లో..



## సామాజిక సమస్యలకు పరిష్కారాలేవి!?

దేశం అభివృద్ధి పథంలో సాగాలంటే, సామాజిక రుగ్మతలను నిర్మూలించడం అత్యవసరం. మహిళా సాధికారత, సమానత్వం, న్యాయం ఇవే భవిష్యత్తు భారతానికి బలమైన పునాదులు. మహిళలు ముందుకు వస్తేనే సమాజం ముందుకు సాగుతుంది. అదే నిజమైన స్వాతంత్ర్యానికి అర్థం.

డా. మార్గం-అడుగు

ఎడిటోరియల్ 2వ పేజీలో

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# సంపాదకీయం
## మార్గం - అడుగు



### దేశంలో సామాజిక సమస్యలకు పరిష్కారాలేవి!?

భారతదేశం స్వాతంత్ర్యాన్ని సాధించి 80 ఏళ్ళు పూర్తిచేసుకుంటున్న ఈ సందర్భంలో, సాధించిన విజయాలకన్నా ఎదుర్కొంటున్న సవాళ్ళే ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ, సామాజిక రంగంలో ఇంకా అనేక రుగ్మతలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. ఇవి పరిష్కారం కానిదే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు.

ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలో అక్షరాస్యత రేటు 77% ఉన్నప్పటికీ, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో లేదు. ప్రైవేట్ విద్యాసంస్థల పెరుగుదలతో విద్య వ్యాపారంగా మారింది. మధ్యతరగతి కుటుంబాలు తమ ఆదాయంలో 25%--40% వరకు విద్య కోసం ఖర్చు చేస్తున్నాయి. పేదలు అప్పులు చేసి పిల్లలకు చదువు చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి వైద్య రంగంలో కూడా కనిపిస్తుంది. దేశంలో మొత్తం ఆరోగ్య వ్యయంలో 55% ప్రజలు స్వంతంగా ఖర్చు చేస్తున్నారు. ప్రతి ఏడాది లక్షలాది కుటుంబాలు వైద్య ఖర్చుల వల్ల పేదరికంలోకి జారిపోతున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి.

ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలపై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, ప్రతి జిల్లాలో ఆధునిక సౌకర్యాలతో ప్రభుత్వ దవాఖానాలు ఏర్పాటు చేయడంలో విఫలమైంది. దీని వల్ల ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్ పై ఆధారపడాల్సి వస్తోంది.

ఆర్థిక అసమానతలు కూడా తీవ్రమైన సమస్యగా మారింది. దేశంలో 40% పైగా సంపద కేవలం 10% మంది చేతుల్లోనే ఉంది. పేదలు పేదలుగానే ఉండిపోతున్నారు. గృహవసతి విషయంలోనూ ఇదే పరిస్థితి. పట్టణాల్లో 20 మిలియన్ గృహాల కొరత ఉందని అంచనా. దీంతో గృహం అనేది చాలా మందికి అందని ద్రాక్షగా మారింది.

ఇక సామాజిక భద్రత మరింత ఆందోళనకరంగా ఉంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం, ప్రతి రోజూ సగటున 90కి పైగా అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. మహిళలపై దాడులు, అపహరణలు పెరుగుతున్నాయి. డ్రగ్స్ వినియోగం యువతలో విస్తరిస్తోంది. ఈ పరిస్థితులు సమాజంలో నైతిక విలువలు క్షీణిస్తున్నాయనే సంకేతాన్ని ఇస్తున్నాయి.

దేశంలో కులవ్యవస్థ కూడా మరో కీలక సమస్యగా పరిణమించింది. రాజ్యాంగం సమానత్వ హామీ ఇస్తున్నప్పటికీ, కుల వివక్ష ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, సామాజిక విభజనలు కొనసాగుతూనే ఉన్నాయి. దేశం నిజమైన సమానత్వం వైపు అడుగులు వేయాలంటే కుల వివక్షను కూకటివేళ్లతో నిర్మూలించాల్సిన అవసరం ఉంది.

ఈ నేపథ్యంలో మహిళా సాధికారత ఒక కీలక పరిష్కార మార్గంగా కనిపిస్తోంది. ఇటీవల ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం, లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించనున్నారు. ఇది 2029 ఎన్నికల నుంచి అమల్లోకి రానుంది. దేశ జనాభాలో దాదాపు 50% మహిళలే ఉన్నప్పటికీ, ప్రస్తుతం లోక్‌సభలో వారి ప్రాతినిధ్యం కేవలం 15% మాత్రమే ఉంది. ఈ అసమానతను సరిచేయడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది.

మహిళలు పాలనలో భాగస్వాములైతే, నిర్ణయాల్లో సమతుల్యత పెరుగుతుంది. ఆరోగ్యం, విద్య, మహిళల భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం పెరుగుతుంది. గ్రామీణ స్థాయిలో జరిగిన అనుభవాలు చూపిస్తున్నట్లుగా, మహిళా నాయకత్వం ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి సూచికలు మెరుగ్గా ఉంటాయి. ఇది మహిళల సామర్థ్యానికి నిదర్శనం.

అయితే, మహిళా రిజర్వేషన్ ఒక్కటే అన్ని సమస్యలకు పరిష్కారం కాదు. ఇది ఒక ప్రారంభం మాత్రమే. సమాజంలో సమగ్ర మార్పు కోసం ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, పౌర సమాజం కలిసి పనిచేయాలి. విద్యా సంస్కరణలు, ఆరోగ్య రంగంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపు, కఠిన చట్టాల అమలు వంటి చర్యలు సమాంతరంగా సాగాలి.

సమాజంలో విలువల ఆధారిత మార్పు అవసరం. కుటుంబం, పాఠశాల స్థాయిలోనే సమానత్వం, గౌరవం, బాధ్యత వంటి విలువలను బోధించాలి. మహిళలను గౌరవించే సంస్కృతి పెంపొందించాలి.

భారతదేశం అభివృద్ధి పథంలో సాగాలంటే, సామాజిక రుగ్మతలను నిర్మూలించడం అత్యవసరం. మహిళా సాధికారత, సమానత్వం, న్యాయం ఇవే భవిష్యత్తు భారతానికి బలమైన పునాదులు. మహిళలు ముందుకు వస్తేనే సమాజం ముందుకు సాగుతుంది. అదే నిజమైన స్వాతంత్ర్యానికి అర్థం.

# నేడే శాంతి చర్చలు!

**మొదటిపేజీ తరువాయి..**

సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది. ఇస్లామాబాద్‌లో దేశ పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలున్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. ఈ చర్చల నేపథ్యంలో గురువారం, శుక్రవారం ఇస్లామాబాద్‌లో సెలవు ప్రకటించారు. దుకాణాలు మూతపడ్డాయి. తమ మధ్యవర్తిత్వంతోనే రెండు వారాల పాటు కాల్పుల విరమణ జరిగిందని చెప్పిన పాకిస్థాన్ (ఖజీతిబబిజీని).. ఇప్పుడు ఇరుదేశాల మధ్య శాంతిచర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నేతృత్వంలోని బృందం అమెరికా తరపున చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాక్ బయల్దేరారంటూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. వారిద్దరూ తమ రాజధాని టెహ్రాన్‌లోనే ఉన్నారని చెప్పింది. ఒకవేళ చర్చలంటూ జరిగితే.. హర్మూజ్‌పై నియంత్రణ, తమ దేశంపై ఉన్న ఆంక్షల నుంచి ఉపశమనం, తన మిత్రపక్షాలపై దాడులు చేయకూడదంటూ 10 పాయింట్ల డిమాండ్ల పైనే ఇరాన్ పట్టుబట్టే అవకాశం ఉంది. ఇక, లెబనాన్‌లోని ఇరాన్ మిత్రపక్షం హెజ్‌బొల్లా గ్రూప్‌పై ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆగడం లేదు. సీజ్‌÷ర్ ప్రకటన తర్వాతే అక్కడ మారణహోమం సృష్టించింది.

అమెరికా–ఇరాన్ మధ్య ఉన్న అపనమ్మకం, ఇజ్రాయెల్ దూకుడు కారణంగా ఈ చర్చల్లో పురోగతిని ఆశించలేమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకున్నట్టు కనిపిస్తోంది. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా ఇరు దేశాలు మధ్య అత్యున్నత స్థాయి చర్చలు ప్రారంభంకావడానికి కేవలం కొన్ని గంటల ముందే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అత్యంత కఠినమైన హెచ్చరికు జారీ చేశారు. మరో 24 గంటల్లో ఏం జరుగుతుందో తెలుస్తుంది అంటూ ఇరాన్‌కు అల్టిమేటం ఇచ్చారు. న్యూయార్క్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ తన వైఖరిని స్పష్టం చేశారు.

అమెరికా యుద్ధనౌకలు ప్రస్తుతం అత్యాధునిక ఆయుధాలతో లోడ్ అవుతున్నాయని, చర్చలు విఫలమైతే ఇరాన్‌పై నేరుగా దాడులు చేసేందుకు వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. " మేం గతంలో ఉపయోగించిన వాటి కంటే మెరుగైన ఆయుధాలను ఇప్పుడు సిద్ధం చేశాం. ఒప్పందం కుదరకపోతే వాటిని త్యంత సమర్థవంతంగా ఉపయోగిస్తాం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ విషయంలో ఒక రీసెట్ ప్రక్రియ జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇప్పటికే పాకిస్థాన్ చేరుకున్నారు. చర్చలపై ఆయన సానుకూల దృక్పథంతో ఉన్నప్పికీ, ఇరాన్ ఒక వేళ డబుల్ గేమ్ ఆడితే మాత్రం తమ బృందం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. "చర్చలు సానుకూలంగా సాగుతాయని నమ్ముతున్నాం. కానీ ఇరాన్ మమ్మల్ని తప్పుదారి పట్టించాలని చూస్తే మాత్రం పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. " అని వాన్స్ స్పష్టం చేశారు.

ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాకర్ ఘలీబాఫ్ ఈ చర్చలకు ముందు రెండు కీలక షరతులను తెరైకి తెచ్చారు. లెబనాన్‌లో తక్షణమే కాల్పుల విరమణ జరగాలి. అమెరికా నిలిపివేసిన ఇరాన్ ఆస్తులను వెంటనే విడుదల చేయాలి. ఈ రెండు అంశాలు నెరవేరితేనే చర్చలు ముందుకు సాగుతాయని ఆయన సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు ఆపకపోతే శనివారం జరగాల్సిన చర్చల నుంచి ఇరాన్ తప్పుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుత ఉద్రిక్తతలకు ప్రధాన కేంద్రంగా హర్మూజ్ జలసంధి నిలిచింది. ప్రపంచ దేశాలకు చమురు సరఫరా అయ్యే ఈ కీలక మార్గంపై ప్రస్తుతం ఇరాన్ పట్టు సాధించింది. గతంలో రోజుకు వంద ఓడలు వెళ్తే ఈ మార్గంలో ఇప్పుడు కేవలం 12 ఓటు మాత్రమే తిరుగుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. దీనిపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇరాన్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, ఇది తమ మధ్య ఉన్న ఒప్పందానికి విరుద్ధమని సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

## ఆ 5 రాష్ట్రాల ఎన్నికల కోసమే..
# ఈ హడావుడి!

**మొదటిపేజీ తరువాయి..**

నిర్వహించనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది.



చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు. 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు. కేవలం మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రత్యేక సమావేశాలను పిలవడంతో ఈ అచిఅ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ బలోపేతంపై సీఎం రేవంత్‌రెడ్డి సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక ప్రసంగం చేసే అవకాశం ఉంది. సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టతని ఇచ్చామని, కేంద్రాన్ని డిమాండ్ కూడా చేశామని ప్రస్తావించారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ హఠాత్తుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు సవరణ , పునర్విభజన చట్టం సవరణ బిల్లులను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక అఖిలపక్ష సమావేశం పెట్టాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలన్నీ కోరాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం ప్రయత్నం చేస్తుందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# డీజీపీగా సివి ఆనంద్?

**మొదటిపేజీ తరువాయి..**

చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఇన్–చార్జ్ డీజీపీగా కొనసాగుతున్న బి. శివధర్ రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండటంతో, ఆ స్థానంలో శాశ్వత ప్రాతిపదికన కొత్త అధికారిని నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నియామకం కోసం రాష్ట్రం పంపిన ఐదుగురు అధికారుల జాబితాను పరిశీలించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , ముగ్గురు అధికారులతో కూడిన ప్యానెల్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఆ జాబితాలో సి.వి. ఆనంద్‌తో పాటు కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్‌గా ఉన్న వినాయక ప్రభాకర్ ఆప్టే , తెలంగాణ జైళ్ల శాఖ డీజీగా ఉన్న సౌమ్య మిశ్రాల పేర్లు ఉన్నాయి. అయితే, ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పేరు ఈ సిఫార్సు జాబితాలో లేకపోవడంతో ఆయన పదవీ విరమణ అనివార్యం కాగా, సీనియారిటీ , రాష్ట్రంలో సుదీర్ఘ కాలం వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం దృష్ట్యా సి.వి. ఆనంద్ పేరుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండుసార్లు డీజీపీ పదవికి ఆయన పేరు పరిశీలనలోకి వచ్చినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల అవకాశం దక్కలేదు, కానీ ఈసారి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఆయన నియమితులయ్యే అవకాశం ఉంది. ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఈ నెల 14వ తేదీ తర్వాత వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవేళ సి.వి. ఆనంద్ బాధ్యతలు చేపడితే, ఆయన పదవీ కాలం 2028 మే వరకు ఉంటుంది. మరోవైపు, మహిళా అధికారులకు కూడా ప్రాధాన్యత ఇస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఒక మహిళా డీజీ స్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఏప్రిల్ 13 నాటికి డీజీపీ నియామకంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో, త్వరలోనే రాష్ట్ర పోలీస్ శాఖలో ఈ కీలక మార్పు చోటుచేసుకోనుంది.

### 20న జగిత్యాలలో భారీ బహిరంగ సభ

**మొదటిపేజీ తరువాయి..**

కలిసి వచ్చిన జీవన్ రెడ్డికి గులబీ బాస్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. జీవన్ రెడ్డి బృందంతో కలిసి లంచ్ చేసిన కేసీఆర్ అనంతరం.. పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డికి పార్టీలో సముచిత ప్రాధాన్యం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రావాలని జీవన్ రెడ్డి ఆహ్వానించగా గులాబీ అధినేత సానుకూలంగా స్పందించారని సమాచారం. బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు టి. జీవన్ రెడ్డికి ముహూర్తం ఖరారు అయింది. ఏప్రిల్ 20వ తేదీన జగిత్యాల వేదికగా బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ నిర్వహిస్తుందని ఆ పార్టీ నేత కొప్పుల ఈశ్వర్ వెల్లడించారు. ఈ సభలో బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి చేరతారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌తో కొప్పుల ఈశ్వర్, ఎల్ రమణ సమావేశమయ్యారు. అనంతరం వీరు విలేకర్లతో మాట్లాడుతూ.. కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి చేరతారని తెలిపారు. ఈ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు శనివారం జగిత్యాలలో స్థలాన్ని పరిశీలిస్తామని ఆయన చెప్పారు.

# ఆర్టీసీ కార్మికులకు... 2.1 శాతం డీఏ పెంపు

**మొదటిపేజీ తరువాయి..**

డీఏ 52.8 శాతానికి చేరుకుంది. జనవరి నుంచి చెల్లించాల్సిన ఈ పెండింగ్ డీఏ బకాయిలను భవిష్యత్తులో రాబోయే మూడు నెలల కాలంలో, ప్రతి నెలా కొంత చొప్పున విడతల వారీగా విడుదల చేయనున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. సంస్థ పరిరక్షణతో పాటు కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు



ఆర్టీసీ వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ సంస్థను బలోపేతం చేసేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం తార్నాక ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయడం, కారుణ్య నియామకాలు చేపట్టడం, గతంలో వివిధ కారణాలతో తొలగించబడిన వారిని త్రిమెన్ కమిటీ ద్వారా తిరిగి విధుల్లోకి తీసుకోవడం వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అంతేకాకుండా, పని భారం తగ్గించేందుకు కొత్త నియామకాలు మరియు ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సుల కొనుగోలు వంటి కార్యక్రమాలతో సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తోందన్నారు.

# 'అన్న'లు లేని తెలంగాణ!
## • మిగిలింది ఐదుగురే!!

**మొదటిపేజీ తరువాయి..**

బాధ్యతలను బడ్సే దేవాకు, కేశాలుకు అప్పగించారు. అయితే, కొన్ని రోజులు కిందటే కమాండర్ దేవా.. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుపోయారు. ఆ తర్వాత బెటాలియన్ బాధ్యతలు నిర్వహిస్తున్న సోడిమల్ల కేశాలు సైతం తాజాగా శుక్రవారం లొంగిపోయారు. ఇతనికి సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ వంటి పేర్లున్నాయి. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్




రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు.మొత్తం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయినట్లు తెలిపారు. వీరిలో గెరిల్లా బెటాలియన్ కమాండర్ సోడిమల్ల అలియాస్ కేశాలు అలియాస్ నిఖిల్ ఉన్నారని వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలు, బంగారంతో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. 36 తుపాకులు, ఐదు ఏకే 47లు, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, 1,007 తూటాలతో పోలీసులు ముందు మావోలు లొంగిపోయినట్లు పేర్కొన్నారు. అలాగే 800 గ్రాముల బంగారం సైతం అప్పగించినట్లు వెల్లడించారు. వీరి లొంగుబాటుతో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పూర్తిగా కనుమరుగైనట్లు డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు.గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా డీజీపీ ఎదుట లొంగిపోయారు. వీరిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ కేశాలు కూడా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ పెరగడంతో మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందివారు కాగా.. ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. 'లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీ కింద రూ.1.93 కోట్లు అందజేస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్యకార్డులు అందజేస్తాం. తెలంగాణకు చెందిన వాళ్లు సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరున్నారు. స్టేట్ కమిటీలో తెలంగాణ వాళ్లు 24 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరే ఉన్నారు. వాళ్లు కూడా లొంగిపోవాలని పిలుపునిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రేమోన్మాదిపై కాల్పులు

**మొదటిపేజీ తరువాయి..**

ఒత్తిడి చేసేవాడు. ఆమె నిరాకరించడంతో కక్ష పెంచుకున్న నిందితుడు, శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి కత్తితో ఆమె గొంతు కోశాడు. తీవ్ర రక్తస్రావంతో కొట్టుమిట్టాడుతున్న కుమార్తెను తండ్రి శ్రీనివాసులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, మార్గమధ్యలో చెన్నూరు వద్ద ఆమె ప్రాణాలు విడిచింది. చనిపోయే ముందు ఆమె నిందితుడు



వెంకటేశ్‌తో పాటు ప్రవీణ్ అనే వ్యక్తి పేరును వెల్లడించింది. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, శనివారం తెల్లవారుజామున మైదుకూరు నుంచి వేరే ప్రాంతానికి తరలిస్తుండగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో వెంకటేశ్ ఇద్దరు కానిస్టేబుళ్లపై దాడి చేసి గాయపరిచాడు. నిందితుడిని అడ్డుకోవడానికి పోలీసులు తొలుత గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. అయినప్పటికీ నిందితుడు లొంగకుండా ఎదురుతిరగడంతో, పోలీసులు ఆత్మరక్షణ కోసం అతడి కాళ్లపై కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన నిందితుడిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఒక పక్క నిందితుడికి చికిత్స జరుగుతుండగా, మరోపక్క అమాయక బాలికను బలిగొన్న ప్రేమోన్మాదికి కఠిన శిక్ష పడాలని స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

# చరిత్ర సృష్టించిన ఆర్టెమిస్-2

**మొదటిపేజీ తరువాయి..**

ఏప్రిల్ 1న ప్రయోగించిన ఈ నౌక చంద్రుని అవతలి వైపు దృశ్యాలను, అరుదైన ఖగోళ విశేషాలను చిత్రీకరించింది. ఈ విజయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తం చేస్తూ, వ్యోమగాములను వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. మానవ పరిణామంలో తదుపరి అడుగు అంగారక గ్రహం అని ఆయన ఆకాంక్షించారు. మూడు భారీ పారాచూట్ల సాయంతో జరిగిన ఈ 'పర్ఫెక్ట్ ల్యాండింగ్' వీడియోలను నాసా విడుదల చేస్తూ, వ్యోమగాములకు ఘనస్వాగతం పలికింది.



సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## పోస్టర్ల ఆవిష్కరణ

కుందుర్పి, ఏప్రిల్ 10 (అడుగు న్యూస్): అనంతపురం నుండి బండ్లపల్లి వరకు ఈనెల 10-12 తేదీల్లో చేపట్టే సీపీఐ పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ కుందుర్పిలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని, జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి పాత విధానాన్నే కొనసాగించాలని నాయకులు డిమాండ్ చేశారు. 12న బండ్లపల్లిలో జరిగే ముగింపు కార్యక్రమానికి ప్రజలు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హరిదాసులు, లక్ష్మణమూర్తి, మధు తదితర నాయకులు పాల్గొన్నారు.

### మాజీ కార్పొరేటర్ చొరవతో రోడ్డు నిర్మాణం పూర్తి

ఉప్పల్(నాచారం), ఏప్రిల్ 10 (అడుగు న్యూస్): ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో హెచ్ఎంటి నగర్ డివిజన్ అన్నపూర్ణ కాలనీ రోడ్ నెంబర్ వన్ లో పెండింగ్‌లో ఉన్న సిమెంట్ రోడ్డు



నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. గత కొద్ది రోజులుగా వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన ఈ పనులపై మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ప్రత్యేక చొరవ చూపారు. ఆమె అధికారులు మరియు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను వేగవంతం చేయించి, స్వయంగా పరిశీలించారు. రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు నాగభూషణం, విఠల్ యాదవ్, నారాయణ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, షేక్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

పాలకుర్తి, ఏప్రిల్ 10 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, పాలకుర్తి మండలంలోని ప్రతి గ్రామంలో ఎటువంటి నిబంధనలు లేకుండా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పాలకుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం



జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం కొనుగోలులో జాప్యం చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారని, క్వింటాకు 2,400 రూపాయల మద్దతు ధర కల్పించాలని కోరారు. ప్రైవేట్ వ్యాపారుల దోపిడీని అరికట్టి, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోమసత్యం, శ్రీలత, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

పాలకుర్తి, ఏప్రిల్ 10 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, పాలకుర్తి మండలంలోని మల్లంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ పోశాల వెంకన్న శు




క్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో గ్రామస్తులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సరిత, కార్యదర్శి కిషోర్, మాజీ సర్పంచ్ మహేందర్ నాయక్ మరియు ఇతర గ్రామ ప్రముఖులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం

న్యూఢిల్లీ,ఏప్రిల్10(అడుగు న్యూస్): బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.




# చిరంజీవులుకు అవార్డు ప్రదానం

హైదరాబాద్, ఏప్రిల్ 10 (అడుగు న్యూస్): మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ మేధావుల ఫోరం రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు సామాజిక రంగానికి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఆయనకు ప్రతిష్టాత్మక "మహాత్మ జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్ అవార్డు -- 2026" అందజేశారు. మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, రిటైర్డ్ డీజీపీ పూర్ణచందర్రావు తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేసి చిరంజీవులను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అంటరానితనం, కుల వివక్షపై పూలే చేసిన పోరాటం మరువలేనిదని, ఆయన ఆశయ సాధనలో చిరంజీవులు వంటి మేధావులు కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. అవార్డు గ్రహీత టి. చిరంజీవులు మాట్లాడుతూ, ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, తన రచనలు మరియు ప్రసంగాల ద్వారా బీసీ వర్గాల్లో చైతన్యం నింపుతూ, సమాజంలో సమతుల్యత కోసం నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా బీసీ నేతలు గుజ్జ సత్యం, ఆర్. రవీందర్ తదితరులను కూడా సన్మానించారు. డా. రాజ్ నారాయణ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక వేత్తలు, నాయకులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు మేలు

దేవరుప్పుల/ రాయపర్తి, ఏప్రిల్ 10 (అడుగు న్యూస్): పాలకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శుక్రవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదటగా, దేవరుప్పుల మండల కేంద్రంలో విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార భవనాన్ని టీఎస్‌డీడీసీఎఫ్ చైర్మన్



గుత్తా అమిత్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాడి పరిశ్రమ రైతులకు అదనపు ఆదాయ వనరు అని, ఈ భవనం ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను అందిపుచ్చుకుని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం, రాయపర్తి మండలం ఏకే తండాలో జరిగిన మహేశ్వరి హత్య ఉదంతంపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న వారిని ఓదార్చారు. ఈ అమానుష ఘటనపై ఆమె తక్షణమే వరంగల్ పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి, నిందితులను 24 గంటల్లోగా అరెస్ట్ చేయాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. నిందితులు ఎంతటి వారైనా, ఏ పార్టీ వారైనా విడిచిపెట్టే ప్రసక్తి లేదు; చట్టం ముందు అందరూ సమానమే అని స్పష్టం చేశారు. మహిళల భద్రత విషయంలో రాజీ పడబోమని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.ఆయా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఝాన్సీ రెడ్డి సమీక్ష:**

పాలకుర్తి మండలంలో సర్పంచ్ ఎన్నికల ఓటమిపై ఝాన్సీ రాజేందర్ రెడ్డి సమీక్షించారు. లోపాలను సరిదిద్దుకుని, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# కలిసే పని చేద్దాం!

మొదటిపేజీ తరువాయి..

మాట్లాడుతూ.. తన విషయంలో పీసీసీ తప్పు చేసి.. ఆ నింద ఏఐసీసీపై వేస్తోందన్నారు. నాకు 14 సార్లు బీ ఫామ్ ఇచ్చారంటే.. అది నా సమర్థతతోనే. కాంగ్రెస్ పార్టీ తిరోగమనంలో పయనిస్తోంది. కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి అని ప్రజల్లో చర్చ మొదలైంది. త్వరలో జగిత్యాలలో సభపెట్టి బీఆర్ఎస్‌లో చేరతానని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమైన టి.జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని కడిగిపారేశారు. కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణపై పట్టు కోల్పోయిందని పేర్కొన్న ఆయన మోసపూరిత కాంగ్రెస్ పోవాలని, కేసీఆర్ మళ్లీ రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ తిరోగమనంలో పయనిస్తోందని జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌తో భేటీ అయిన జీవన్ రెడ్డి ఏప్రిల్ 20న పార్టీలో చేరుతున్నానని ప్రకటించారు. కొన్నాళ్లుగా పార్టీలో జరుగుతున్న పరిణామాలతో కలత చెందాను. అందుకే.. బీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్‌తో కలిసి పని చేయాలనుకుంటున్నా. నేను అధికార పార్టీలోకి వెళ్ళట్లేదు. రెండేళ్లలో 3 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు,
ఇచ్చింది 17 వేల ఉద్యోగాలు. మొదటి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు అని అన్నారు.. రెండో సంవత్సరం 1 లక్ష ఉద్యోగాలు అని అన్నారు, ఏమైంది?' అని జీవన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. పదవుల కోసమే బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లాలంటే తాను ఆరోజే వెళ్ళేవాడినని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చనందుకు, ప్రజల పక్షాన పోరాడేందుకు తాను బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లేందుకు నిర్ణయించుకున్నానని జీవన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌తో 20 ఏళ్లకుపైగా అనుబంధాన్ని తెంచుకున్న జీవన్ రెడ్డి శుక్రవారం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. తన బృందంతో కలిసి వచ్చిన జీవన్ రెడ్డికి గులబీ బాస్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. జీవన్ రెడ్డి బృందంతో కలిసి లంచ్ చేసిన కేసీఆర్ అనంతరం.. పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డికి పార్టీలో సముచిత ప్రాధాన్యం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. జగిత్యాలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రావాలని జీవన్ రెడ్డి ఆహ్వానించగా గులాబీ అధినేత సానుకూలంగా స్పందించారని సమాచారం. అధికార పార్టీ నుంచి ప్రతిపక్షంలోకి ఎందుకు వెళ్తున్నానో మీకే తెలియాలంటూ కాంగ్రెస్ నేతలకు చురకలు అంటించారు. మిగిలిన రెండున్నరేళ్లు అయినా కాంగ్రెస్ సర్కార్ బాగా పని చేయాలని తాను కోరుకుంటున్నట్లు జీవన్ రెడ్డి చెప్పారు. జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. ' అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి , కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు. తాజా రాజకీయాలు, కాంగ్రెస్ తీరును ఆయన కెసిఆర్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.' తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్ల కైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు. ఈ సంద్భంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు. జీవన్ రెడ్డి కూడా కెసిఆర్‌కు శాలువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉండి, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం, కేసీఆర్‌ను 'అన్నా' అని సంబోధిస్తూ భావోద్వేగానికి లోనవ్వడం చూస్తుంటే.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవించబోతున్నాయని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఈ చేరిక ఒక పెద్ద ఊతమివ్వనుంది.






## గిది అగ్గిపెట్టేనుల్లా!?

గిది నిజ్జంగా అగ్గి పెట్టే! గా ఎండకు ఎండదు. ఆనకు తడవదు. సలికి మండకుండా ఉండదు. జేబుల పెట్టుకుంటే



మోటుగుండదు. అరె! మరైతే గిదేం అగ్గిపెట్టే? అని గద అనిపిస్తుంది. కనీ, గిది నిజంగా అగ్గి పెట్టే!
రాగితోటి చేసింది. గుండ్రంగ, జేబుల పట్టేంతే ఉంటది. గదానికి ఓ మూత గూడ ఉంటది. పెట్టెకు తాళం యేసినట్లు గది యేసుకోవచ్చు. ఇగ గదాని మూత తెరిస్తే, లోపల అగ్గి పుల్లలు పట్టే తలముంటది. గవాటిని గండ్లకెల్లి తీసి, గా డబ్బా తలాపు అంచుకు లోపల గీకితిమా? ఎలుగుతది! జేబుల పెట్టుకుంటే రాగి కావడంతో ఆరోగ్యంగా ఉంటది. ఎన్కటికి గిసొంటి అగ్గి పెట్టెలే ఉండేటియట? ఎన్కటి రోజులే బంచిగున్నయి గదా? ఇగిప్పుడైతే కాగితానియి రాబట్టే! గయి గిట్ల గీకితే గట్ల ఇరిగి పోబట్టే!! మంచిగుంది కదా? గీ అగ్గి పెట్టె!?

# డా. మలయ శ్రీకి నివాళులు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (అడుగు న్యూస్): ప్రఖ్యాత బౌద్ధ తత్వవేత్త, రచయిత డాక్టర్ మలయ శ్రీ గారి మరణంపై సోమనాథ కళా పీఠం అధ్యక్షులు డా. రాపోలు సత్యనారాయణ, అడుగు డిజిటల్ మీడియా చీఫ్ ఎడిటర్ డా. మార్గం లక్ష్మీ నారాయణ, ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య, పాలకుర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లెనిన్ గూడూరు, మార్గం సాయి సందేశ్ తేజ, రాపోలు సోంసాయి తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సాహిత్య సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

### జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా


మొదటిపేజీ తరువాయి..

చోటుచేసుకుంది. గతేడాది మార్చి 14న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైన విషయం తెలిసిందే. దీంతో ఇక లాభం లేదనుకుని ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

# హరివంశ్ కు మరో ఛాన్స్

మొదటిపేజీ తరువాయి..

మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నామినేట్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80 ప్రకారం.. సాహిత్యం, శాస్త్రం, కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. హరివంశ్ తనకున్న సుదీర్ఘ జర్నలిజం అనుభవం, సామాజిక స్పృహతో ఈ కోటాలో ఎంపికయ్యారు. బిహార్ నుంచి జేడీయూ తరఫున ఎన్నికైన ఆయన సభ్యత్వ కాలం ఏప్రిల్ 9వ తేదీన ముగిసింది. సాధారణంగా పార్టీ కోటాలో సభ్యత్వం ముగిసిన తర్వాత తిరిగి పార్టీ టికెట్‌పైనే వస్తుంటారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్రపతి కోటా ద్వారా నేరుగా సభకు పంపడం గమనార్హం. రాజ్యసభ 13వ డిప్యూటీ ఛైర్మన్‌గా ఆయన పనిచేసిన తీరు అమోఘం. క్లిష్టమైన బిల్లుల చర్చ



సమయంలో సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, ఆయన చూపిన ప్రతిభ, నిష్పక్షపాత నిర్ణయాలు అధికార, ప్రతిపక్షాల మన్ననలు పొందాయి. హరివంశ్ నారాయణ్ సింగ్‌ను మళ్లీ సభకు పంపడం వెనుక కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను రచించినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎగువ సభలో ప్రతిపక్షాల బలం గణనీయంగా ఉన్నప్పుడు, సభను సమర్థవంతంగా నడపగలిగే వ్యక్తుల అవసరం ప్రభుత్వానికి ఉంటుంది. హరివంశ్ ఆ విషయంలో ఇప్పటికే తన సత్తా చాటారు. తాజా నామినేషన్‌తో ఆయన మళ్లీ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశముంది. నామినేటెడ్ సభ్యుడిగా ఉంటూ ఈ బాధ్యతలు చేపడితే, అది సభకు మరింత గౌరవాన్ని తెస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సీనియర్ జర్నలిస్టుగా హరివంశ్‌కున్న విలువలు, రాజకీయాలకు అతీతంగా ఆయనకు ఉన్న ఆదరణ ప్రభుత్వానికి సానుకూల అంశమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాజకీయాల్లో హుందాతనం తగ్గుతున్న కాలంలో, హరివంశ్ నారాయణ్ సింగ్ వంటి సీనియర్ల సేవలను వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని తెలిపారు. రంజన్ గొగొయ్ స్థానంలో ఓ అనుభవజ్ఞుడైన పార్లమెంటేరియన్ రావడం సభ గౌరవాన్ని మరింత పెంచుతుందనడంలో సందేహం లేదని పేర్కొన్నారు. హరివంశ్ నారాయణ్ సింగ్ మళ్లీ డిప్యూటీ చైర్మన్ బాధ్యతలు చేపడితే.. సభలో చర్చల నాణ్యత మరింత మెరుగుపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆటలు

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## ధోనినే నా రోల్ మోడల్'..

### ముకుల్ చౌదరి కీలక వ్యాఖ్యలు

ఐపీఎల్ అంటేనే అనామక ఆటగాళ్లను రాత్రికి రాత్రే స్టార్లుగా మార్చే వేదిక. 2026 సీజన్‌లో అటువంటి ఒక అద్భుత సంచలనం నమోదైంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో కేకేఆర్ బౌలర్లను ఉతికి ఆరేసిన ముకుల్ చౌదరి ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ అయ్యాడు. కేవలం 27 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీతో లక్నో సూపర్ జెయింట్స్ కి అద్భుత విజయాన్ని అందించిన ఈ కుర్రాడి వెనుక ఒక స్ఫూర్తిదాయకమైన కథ ఉంది. ముకుల్ చౌదరి రాజస్థాన్‌లోని ఒక సాధారణ సైనిక కుటుంబం నుండి వచ్చాడు. అతని తండ్రి భారత సైన్యంలో జవాన్‌గా దేశ సేవ చేశారు. "పోరాటం నా రక్తంలోనే ఉంది" అని ముకుల్ గర్వంగా చెబుతుంటాడు. చిన్నప్పటి నుండి క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో పెరిగిన ముకుల్, తన తండ్రి నుండి మొండి పట్టుదలను నేర్చుకున్నాడు. మైదానంలో ఎంతటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా లొంగిపోకుండా పోరాడే గుణం అతనికి తన తండ్రి వల్లే వచ్చిందని మ్యాచ్ అనంతరం ముకుల్ భావోద్వేగంతో వెల్లడించాడు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ముకుల్ క్రీజులోకి వచ్చాడు. సునీల్ నరైన్, మిచెల్ స్టార్క్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను ఎదుర్కోవడం ఏమాత్రం సులభం కాదు. కానీ ముకుల్ ఏమాత్రం బెదరకుండా తన బ్యాట్‌కు పనిచెప్పాడు. మైదానం నలుమూలలా సిక్సర్ల వర్షం కురిపించాడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో అతను ఆడిన తీరు చూస్తుంటే ఒక అనుభవం ఉన్న ఫినిషర్ ఆడుతున్నట్లుగా అనిపించింది. ముకుల్ చౌదరి ఎంఎస్ ధోనీకి వీరాభిమాని. "నేను చిన్నప్పటి నుండి ధోనీ భాయ్‌ని చూస్తూ పెరిగాను. మ్యాచ్‌ను చివరి వరకు తీసుకెళ్లి ఎలా ముగించాలో ఆయనను చూసే నేర్చుకున్నాను. నా బ్యాటింగ్ స్టైల్‌లో కూడా ఆయన ప్రభావం ఉంటుంది" అని ముకుల్ పేర్కొన్నాడు. లక్నో జట్టు డైరెక్టర్ టామ్ మూడీ కూడా ముకుల్ బ్యాటింగ్‌ను మెచ్చుకుంటూ.. అతను జట్టుకు దొరికిన అసలైన ఆణిముత్యం అని కొనియాడారు. ముకుల్ ప్రయాణం అంత సులభంగా సాగలేదు. రాజస్థాన్ దేశవాళీ క్రికెట్‌లో నిలదొక్కుకోవడానికి అతను ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. కనీసం బ్యాట్ కొనుక్కోవడానికి కూడా ఇబ్బంది పడిన రోజులు ఉన్నాయని అతను గుర్తు చేసుకున్నాడు. అయితే తన ప్రతిభను గుర్తించిన లక్నో స్కౌట్స్, అతనికి ట్రయల్స్‌లో



అవకాశం ఇచ్చారు. అక్కడ తన పవర్‌ఫుల్ హిట్టింగ్‌తో మెప్పించిన ముకుల్, ఇప్పుడు ఐపీఎల్ వేదికపై తన సత్తా చాటుతున్నాడు. ఒక్క ఇన్నింగ్స్‌తో ముకుల్ చౌదరి పేరు ఇప్పుడు సోషల్ మీడియాలో మారుమోగిపోతోంది. రిషభ్ పంత్ నేతృత్వంలోని లక్నో జట్టుకు ఇతను ఒక ప్రధాన అస్త్రంగా మారాడు. తన తండ్రి సరిహద్దులో దేశాన్ని రక్షిస్తే, తాను మైదానంలో పరుగుల వర్షం కురిపించి తండ్రి పేరు నిలబెడుతున్నానని ముకుల్ చెప్పిన మాటలు అభిమానుల హృదయాలను గెలుచుకుంటున్నాయి. మరిన్ని మ్యాచుల్లో ముకుల్ ఇలాగే రాణించి భారత జట్టులోకి రావాలని ఆశిద్దాం.

## బాబర్ అజామ్ సూపర్ ఫీట్!

పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో నిలకడగా రాణిస్తున్న పెషావర్ జల్మీ కెప్టెన్ బాబర్ అజామ్ టీ20 క్రికెట్‌లో మరో కీలక మైలురాయి అందుకున్నాడు. ఈ లీగ్‌లో తాజాగా కరాచీ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బాబర్ (87 పరుగులు) సూపర్ హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. ఈ క్రమంలోనే అతడు వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్ రికార్డ్ బ్రేక్ చేసి అరుదైన ఘనత సాధించాడు. ఇంతకీ అదేంటంటే?టీ20 క్రికెట్‌లో బాబర్ తనదైన ముద్ర వేస్తున్నాడు. తాజాగా ఈ ఫార్మాట్‌లో 12 వేల పరుగుల మైలురాయి పూర్తి చేసుకున్నాడు. అయితే 338 ఇన్నింగ్స్‌ల్లోనే బాబర్ ఈ మార్క్ అందుకోవడం విశేషం. ఈ నేపథ్యంలోనే అత్యంత తక్కువ ఇన్నింగ్స్‌ల్లో 12వేల టీ20 రన్స్ పూర్తి చేసుకున్న బ్యాటర్‌గా వరల్డ్ రికార్డ్ కొట్టాడు. ఇదివరకు ఈ ఘనత క్రిస్ గేల్ పేరిట ఉండేది. అతడు 343 ఇన్నింగ్స్‌లో ఈ ఫీట్ అందుకున్నాడు. తాజాగా బాబర్ అది బ్రేక్ చేశాడు. ఇక ఈ లిస్ట్‌లో టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మూడో స్థానంలో ఉన్నాడు. విరాట్ 360 ఇన్నింగ్స్‌లో ఈ ఫీట్ సాధించాడు. కాగా, టీ20ల్లో 12 వేల పరుగులు పూర్తి చేసిన పాకిస్థాన్ రెండో బ్యాటర్‌గా బాబర్ నిలిచాడు. అతడి కంటే ముందు మాజీ బ్యాటర్ షోయబ్ మాలిక్ ఈ ఘనత అందుకున్నాడు. షోయబ్ 557 మ్యాచ్‌ల్లో 13,571 చేశాడు.2015లో వన్డేల్లో అరంగేట్రం చేసిన బాబర్ ఆ ఫార్మాట్



లోనూ పలు ఘనతలు సాధించాడు. గతంలో 97 ఇన్నింగ్స్‌ల్లోనే 5,000 వన్డే పరుగులు పూర్తి రికార్డ్ కొట్టాడు. ఈ ఫార్మాట్‌లో అత్యంత తక్కువ ఇన్నింగ్స్‌లో ఈ ఫీట్ సాధించిన బ్యాటర్‌గానూ బాబర్ రికార్డు క్రియేట్ చేశాడు. 2021లో వన్డే ర్యాకింగ్స్‌లో టాప్ ప్లేస్ కూడా దక్కించుకున్నాడు. ఇక ఇప్పటిదాకా బాబర్ వన్డేల్లో 140 మ్యాచ్‌ల్లో 6501 పరుగులు చేశాడు. ఇందులో 20 సెంచరీలు ఉన్నాయి. ఇక మ్యాచ్ విషయానికొస్తే, తొలుత బ్యాటింగ్ చేసిన పెషావర్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. బాబర్ (87) హాఫ్ సెంచరీతో రాణించగా, కుశాల్ మెండీస్ (109 పరుగులు, 52 బంతుల్లో) సెంచరీతో అదరగొట్టాడు. చివర్లో అబ్దుల్ సమద్ (40 పరుగులు, 12 బంతుల్లో: 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో పెషావర్‌కు భారీ స్కోర్ దక్కింది. అనంతరం ఛేదనలో కరాచీ చేతులెత్తేసింది. 16.1 ఓవర్లలో 87 పరుగులకే కుప్పకూలింది. అజామ్ ఖాన్ (25 పరుగులు) టాప్ స్కోరర్. పెషావర్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయిన కరాచీ ఘోర ఓటమి మూటగట్టుకుంది. ఇఫ్తికార్ అహ్మద్, నహిద్ రానా, సుఫియాన్ ముకీమ్ తలో 3, షరీఫుల్ ఇస్లామ్ 1 వికెట్ దక్కించుకున్నారు. ఆల్‌రౌండ్ షో ప్రదర్శన చేసిన పెషావర్ 159 పరుగుల భారీ తేడాతో నెగ్గింది.

## ఆర్సీబీకి కొత్త రోల్ మోడల్ వైభవ్ సూర్యవంశీ!

వైభవ్ సూర్యవంశీ.. భారత క్రికెట్ ఆకాశంలో ధ్రువతారలా మెరుస్తున్న 15 ఏళ్ల వండర్ కిడ్. ఒక్క ఏడాదిలోనే ప్రపంచ క్రికెట్ చూపు తనవైపు తిప్పుకున్న ఈ కుర్రాడు ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ జట్టులో ఉన్నాడు. అయితే భవిష్యత్తులో వైభవ్ ఏ జట్టుకు ఆడనున్నాడు? రాజస్థాన్‌లోనే కొనసాగుతాడా లేక మరేదైనా పెద్ద టీమ్ అతడిని ఎగరేసుకుపోతుందా? అన్న చర్చ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యింది. ముఖ్యంగా వైభవ్ తర్వాతి మకాం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కావచ్చని వినిపిస్తున్న వార్తలు ఫ్యాన్స్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. బీహార్ రాజధాని పాట్నాలో జెనెక్స్ అకాడమీ నడుపుతున్న మనీష్ ఓజా దగ్గరే వైభవ్ క్రికెట్ ఓనమాలు నేర్చుకున్నాడు. వైభవ్ టాలెంట్ గురించి మనీష్‌కు తెలిసినంతగా ఎవరికీ తెలియదు. తాజాగా టీవీ9కి ఇచ్చిన ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలో మనీష్ ఓజా ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. భవిష్యత్తులో విరాట్ కోహ్లీ ఐపీఎల్ నుంచి తప్పుకుంటే, ఆర్సీబీకి ఒక కొత్త రోల్ మోడల్ కావాలని, ఆ స్థానాన్ని భర్తీ చేసే సత్తా వైభవ్ సూర్యవంశీకి మాత్రమే ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బ్రాండ్ వాల్యూ పరంగా కోహ్లీ ఇమేజ్‌ను కొనసాగించే సత్తా వైభవ్‌కు ఉందని ఆయన చెప్పుకొచ్చారు. 2028 సీజన్ కంటే ముందు జరిగే మెగా వేలంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వైభవ్ కోసం సర్వశక్తులు ఒడ్డుతుందని కోచ్ మనీష్ ఓజా జోస్యం చెప్పారు. "ప్రతి టీమ్‌కు ఒక బ్రాండ్ అంబాసిడర్ కావాలి. రాజస్థాన్ రాయల్స్‌లో వైభవ్, యశస్వి బ్యాటింగ్ చేసినంత సేపు టీవీ చూసి తర్వాత ఆపేసే వారు చాలా మంది ఉన్నారు. చెన్నైలో ధోనీ తర్వాత టీమ్‌ను ఎవరు చూస్తారు? అందుకే ఆర్సీబీ తన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వైభవ్‌ను కొనుగోలు చేసేందుకు ఎంతకైనా తెగిస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. కోచ్ మాటలు వినడానికి ఆసక్తికరంగా ఉన్నా.. క్షేత్రస్థాయిలో ఇది అంత సులభం కాదు. ఏ జట్టు అయినా తమ వద్ద ఉన్న అత్యుత్తమ ఆటగాళ్లను వదులుకోవడానికి ఇష్టపడదు. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్ వైభవ్ సూర్యవంశీ లాంటి అరుదైన ప్రతిభను వెలికితీసి అతనికి గుర్తింపు తెచ్చింది. మెగా వేలం నిబంధనల ప్రకారం ప్రతి టీమ్ 4 నుంచి 6 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకునే



అవకాశం ఉంటుంది. రాజస్థాన్ ఖచ్చితంగా వైభవ్‌ను రిటైన్ చేసుకునేందుకే మొగ్గు చూపుతుంది. వైభవ్ కూడా ఒకవేళ తనకు తానుగా రిలీజ్ చేయమని కోరితే తప్ప, అతను జట్టును వీడే అవకాశం లేదు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ వయస్సు కేవలం 15 ఏళ్లే. అంటే అతని ముందు సుదీర్ఘమైన కెరీర్ ఉంది. 2027 చివరిలో జరిగే మెగా వేలం నాటికి వైభవ్ మరింత రాటుదేలే అవకాశం ఉంది. అప్పుడు అతని ధర రూ.10 నుంచి 12 కోట్ల పైమాటే ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరి ఆర్సీబీ ఆశలు నెరవేరుతాయా? లేదా రాజస్థాన్ తన స్టార్ ప్లేయర్‌ను భద్రంగా కాపాడుకుంటుందా? అనేది వేచి చూడాలి.

# సినిమా

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..





## డెకాయిట్.. అడవి శేష్ కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన

### నటుడు నాని ప్రత్యేక అభినందనలు

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్ 'డెకాయిట్' శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలై పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. ఈ నేపథ్యంలో నేచురల్ స్టార్ నాని ఈ చిత్రంపై ప్రశంసల వర్షం కురిపించాడు. అడివి శేష్ కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ ప్రదర్శన అని, 'డెకాయిట్' ఒక నిజమైన బ్లాక్ బస్టర్ అని ఎక్స్ వేదికగా కొనియాడారు. 'డెకాయిట్' సినిమా ప్రీమియర్ చూసిన అనంతరం నాని తన ఎక్స్ ఖాతాలో స్పందిస్తూ, 'డెకాయిట్.. ఒక నిజమైన బ్లాక్ బస్టర్! ఈ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అస్సలు మిస్ కావద్దు. అడివి శేష్ అద్భుతంగా నటించాడు, తన కెరీర్‌లో ఇదే బెస్ట్ పెర్ఫార్మెన్స్. అడివి శేష్‌కు, రచయిత అబ్బూరి రవి గారికి, స్క్రీన్ ప్లే విభాగానికి నా అభినందనలు అని నాని పేర్కొన్నారు. అలాగే హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, 'మృణాల్.. ఈ పాత్రలో నువ్వు చాలా అందంగా లీనమైపోయావు. నీ ఖాతాలో మరో గొప్ప సినిమా చేరింది' అని ప్రశంసించారు. చిత్ర దర్శకుడు షనీల్ డియో పనితీరును, సంగీతాన్ని మరియు విజువల్స్‌ను నాని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. నిర్మాత సుప్రియ యార్లగడ్డ ఈ ఏడాదిలోనే ఒక అద్భుతమైన చిత్రాన్ని నిర్మించారని నాని కొనియాడారు. నాని చేసిన పోస్ట్‌పై అడివి శేష్ స్పందిస్తూ, థాంక్యూ సో మచ్ బిగ్ బ్రో. మీ రివ్యూ చూశాక మా టీమ్ అంతా చాలా ఉత్సాహంగా ఉన్నారు. మీ మాటలు నాకు ఎంతో ప్రత్యేకం. నిజంగా నా మనసు నిండిపోయిందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమాకు ప్రీమియర్ నుంచే పాజిటివ్ రివ్యూలు వస్తుండటంతో 'డెకాయిట్' బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## మైఖేల్ జాక్సన్ బయోపిక్ ట్రైలర్ విడుదల విడుదల

ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది . ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుండటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను మరియు వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. కేవలం ఒక సంగీత ప్రయాణంలా కాకుండా, ఒక లెజెండరీ స్టార్ జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరించే ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని హంగులతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.







## కథలో బలం లేకున్నా కథనంలో కొత్తదనం

అడివి శేష్ డబుల్ హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్నారు. పైగా 'మేజర్'తో జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నాడు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'డెకాయిట్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ మంచి అంచనాలు ఏర్పడ్డాయి. హరిదాస్ (అడివి శేష్) ఓ హత్య కేసులో 13 ఏళ్లుగా జైలు జీవితం అనుభవిస్తుంటాడు. ఓరోజు తనని కడప జైలు నుంచి మారుస్తుండగా పోలీసుల నుంచి తప్పించు కుంటాడు. దీనికోసం ఇషాద్ భాయ్ (అతుల్ కులకర్ణి) అతనికి సాయం చేస్తాడు. హరి అలా తప్పించుకోగానే తనని దుబాయ్ పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా.. దానికోసం ఇంకా రూ.60లక్షలకు పైగా డబ్బు అవసరమవుతుంది. అయితే అతను దుబాయ్‌కి వెళ్లేలోపు తనకు అవసరమైన డబ్బు సంపాదించడంతో పాటు మరో పని కూడా చేయాలనుకుంటాడు. తనని జైలు పాలయ్యేలా చేసిన తన మాజీ ప్రేయసి సరస్వతి అలియాస్ జూలియట్ (మృణాల్ ఠాకూర్)పై పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఈక్రమంలోనే ఆమెను వెతుక్కుంటూ ఇంటికెళ్లగా ఓ ఆరేళ్ల కూతురి తల్లిగా దర్శనమిస్తుంది సరస్వతి. ఆమె భర్త భాస్కర్ (వైభవ్) తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలై ఉంటాడు. తన ప్రాణాలు కాపాడాలంటే ఆమెకు రూ.1కోటి డబ్బు అవసరం. ఆమె పరిస్థితిని చూసిన హరి.. తన ఆర్థిక అవసరాన్ని అడ్డం పెట్టుకునే దెబ్బ కొట్టాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. హరిని సరస్వతి హత్య కేసులో ఎందుకు ఇరికించింది? దీనికి ఆమె భర్త భాస్కర్‌కు ఉన్న లింకేంటి? ఈ కథలో సీఐ స్వామి అలియాస్ రాంబాబు (అనురాగ్ కశ్యప్), కరుణ హాస్పిటల్స్ ఛైర్మన్ (ప్రకాశ్ రాజ్), మల్లి (కామాక్షి భాస్కర్ల) పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటన్నదే కథ. అడివి శేష్ సినిమా అనగానే ప్రేక్షకుల్లో బలమైన భరోసా కనిపిస్తుంది. తను ఓ కథ ఎంచుకున్నాడంటే తప్పకుండా అందులో ఏదో వైవిధ్యత ఉంటుందని.. థ్రిల్‌కు ఏ లోటు ఉండదని అందరి నమ్మకం. ఇక ఈసారి 'డెకాయిట్'కి తనే స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించాడనే సరికి దీనిపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. కథ, కథనాల్లో మరీ అంత కొత్తదనమేమీ లేకపోయినా కొన్ని మెరుపులతో ఆ లోటు తెలియనీయలేదు. ఓ కులాంతర ప్రేమకథకు.. తనదైన శైలిలో ట్విస్ట్‌లు, టర్న్‌లు జోడించి ఓ మాస్ యాక్షన్ సినిమాని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు శేష్ . హీరో ఎప్పుడైతే జైలు నుంచి తప్పించుకుంటాడో అక్కడి నుంచి సినిమా వేగం పుంజుకుంటుంది.

## కొరియన్ కనకరాజు నుంచి కమ్సాహంనిదా' పాట ప్రోమో

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' . ఇండో–కొరియన్ నేపథ్యంలో హారర్–కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా




మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## నటుడు ప్రభాస్ లెజెండ్

బాలీవుడ్ సెన్సేషన్ డైరెక్టర్ ఆదిత్య ధర్ మన రెబల్ స్టార్ ప్రభాస్ కు 'లెజెండ్' అంటూ కితాబిచ్చేశారు. రెబల్ స్టార్.. ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ఇవి ప్రభాస్ ను ఫ్యాన్స్ ముద్దుగా పిలుచుకునే పేర్లు. ఈశ్వర్ తో మొదలైన ప్రభాస్ జర్నీ నేడు దేశం గర్వించే రేంజ్ కు చేరుకుంది. కానీ మన డార్లింగ్ చాలా సింపుల్ గా కూల్ గా ఉంటాడు తప్ప స్టార్‌డమ్ గురించి ఎప్పుడూ గొప్పలు చెప్పుకోరు. ఎంతటి వారైనా ప్రభాస్ తో కలిసి వర్క్ చేసారంటే ప్రేమలో పడిపోవాల్సిందే. తాజాగా ఇటీవల సందీప్ రెడ్డి వంగాతో కలిసి 'ధురంధర్ 2' సినిమాను వీక్షించారు ప్రభాస్. అయితే, సినిమా చూసి సైలెంట్‌గానే వెళ్ళిపోయాడు డార్లింగ్. కనీసం సోషల్ మీడియాలో రివ్యూ కూడా ఇవ్వలేదు. కానీ, ఆ సినిమా దర్శకుడు ఆదిత్య ధర్ స్పందించిన తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా చేసిన పోస్ట్‌కు రిప్లై ఇచ్చిన ఆదిత్య.. 'ది లెజెండ్ ప్రభాస్ సర్‌కి నా ప్రేమను తెలియజేయండి' అంటూ ట్వీట్ చేశారు. ఇక్కడి నుంచి సోషల్ మీడియాలో లెజెండ్ ప్రభాస్ ట్యాగ్స్ ఓ రేంజ్‌లో ట్రెండ్ అవుతున్నాయి.

Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005